క్లుప్తంగా

పాలిథిన్ వస్తువులు స్వాధీనం



విశాలాక్షినగర్ షాపుల్లో స్వాధీనం చేసుకొన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో శానిటరీ సిబ్బంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం శానిటరీ సిబ్బంది, పలు సచివాలయాల సిబ్బంది విశాలాక్షినగర్‌లోని పాన్ షాపులు, టిఫిన్ సెంటర్లు తనిఖీ చేశారు. పలు షాపుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు సంబంధించిన కవర్లు, పేపరు కప్పులు, పేపరు ప్లేట్లు స్వాధీనం చేసుకొన్నారు. యజమాన్లకు జరిమానా విధించనున్నట్లు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు జరుగుతుందన్నారు. తనిఖీల్లో సచివాలయాల సిబ్బంది, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గెడ్డలో పూడిక తొలగింపు



పూడిక తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని నెహ్రూనగర్ రామ్‌నగర్ గెడ్డలో పేరుకుపోయిన పూడికను జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. స్థానికులు వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లాదుర్గారావుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. దీంతో జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం గెడ్డలోని పూడికను తొలగించారు. ఈ సందర్భంగా దుర్గారావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రెండు ప్రాంతాల్లో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్-స్వచ్ఛ విశాఖ'

విశాఖ సిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్-స్వచ్ఛ విశాఖ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం(18వ తేదీ) ఉదయం 10 గంటలకు సెంట్రల్ పార్క్ వద్ద, అనంతరం 11.30 గంటలకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలతో పాటు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనవసరమైన కాగితాలను తొలగించాలని తెలిపారు. సంస్థ నిర్వహణలో ఉన్న అన్ని పార్క్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని శతశాతం నిషేధించాలని ఆదేశించారు. తప్పనిసరిగా వస్త్ర లేదా కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు. విధిగా పొడి చెత్త, తడి చెత్తలకే వేర్వేరుగా చెత్త బుట్టలను వినియోగించాలని సూచించారు.

కుక్కను హతమార్చిన ఘటనపై ఫిర్యాదు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-9లో ఓ యువకుడు వీధి కుక్కపై దాడి చేసి హతమార్చిన ఘటనపై దయా యానిమల్ అసోసియేషన్ సభ్యులు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడు విచక్షణారహితంగాకుక్కపై రాళ్లతో దాడి చేసినట్టు పేర్కొన్నారు.



అంబేడ్కర్‌కాలనీ దగ్గర గెడ్డలో పూడికలు

గెడ్డల నిర్వహణ ఘోరం!

ఎక్కడికక్కడ నిలిచిపోతున్న మురుగు

దోమలు, ఈగలతో సహవాసం

పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది

మద్దిలపాలెం: గెడ్డల నిర్వహణ గాడి తప్పింది. ఫలితంగా ఎక్కడికక్కడ పూడికలతో నిండిపోయాయి. దుర్వాసన వెదజల్లుతున్నాయి. పగటి పూట ఈగలతో, సాయంత్రం వేళ దోమలతో గెడ్డ పరివాహక ప్రాంతాల్లో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఎప్పటికప్పుడు పూడికలు తీయకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి వస్తోందని పేర్కొంటున్నారు.

కేఆర్‌ఎంకాలనీ నుంచి ఇసుకతోట వరకూ

కేఆర్‌ఎంకాలనీ నుంచి ఇసుకతోట వరకూ గెడ్డ పూడికల మయంగా మారిపోయింది. ఈ గెడ్డ ఆధునికీకరణకు కోట్లాది రూపాయలు వెచ్చించారు. గెడ్డ అడుగు భాగమంతా కాంక్రీట్ వేశారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా నిర్మించారు. అయినా సకాలంలో గెడ్డలో పేరుకపోయిన చెత్త తొలగించకపోవడంతో పూడికలతో నిండిపోయింది.

రజకవీధి- అంబేడ్కర్‌కాలనీ మధ్య అధ్వానం

ఇసుకతోట రజకవీధి మీదుగా అంబేడ్కర్ కాలనీ నుంచి ఇసుకతోట ప్రధాన రహదారి వరకూ ప్రవహించే గెడ్డ చెత్తాచెదారంతో నిండిపోయింది. ఇటీవలే రజకవీధిలో రెండు లారీల చెత్త తొలగించారు. అయినా ఇంకా టన్నుల కొద్దీ పూడికలు పేరుకుపోయి ఉన్నాయి. దీంతో అంబేడ్కర్ కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాధులు ప్రబలుతాయని భయపడుతున్నారు. సకాలంలో పూడికలు తొలగించడం లేదని..దీంతో వర్షాలకు మురుగు పొంగిపొర్లుతోందని వాపోతున్నారు.

దోమల బెడద

సాయంత్రం అయ్యేసరికి దోమల దాడికి గురవుతున్నాం. ఇంటి తలుపులు, కిటికీలు తీసి ఉంటే చాలు ఇళ్లలోకి దోమలు చేరుతున్నాయి. రాత్రి వేళ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమ కాటుతో ఒంటినిండా దద్దుర్లు వస్తున్నాయి. చలికాలం కావడంతో ఆ దద్దురుపై ఏమాత్రం గోకినా అక్కడ ఎలర్జీ వస్తుంది. జ్వరం వస్తే వణికిపోతున్నాం. దోమల కట్టడికి చర్యలు తీసుకోవాలి.

– డి. గోవింద్, ఇసుకతోట

ఈగల జోరు

గెడ్డ ప్రవాహం దగ్గర నివాసముంటున్నాం. గెడ్డలో పూడికలు పేరుకుపోవడంతో ఈగలు, దోమల జోరుతో సతమతమవుతున్నాం. ఇళ్లలో ఆహారపదార్థాలపై వాలుతున్న ఈగలు చూసి ఎక్కడ అనారోగ్యానికి గురవుతామేమోనని ఆందోళన చెందుతున్నాం. ఎప్పటికప్పుడు పూడికలు తీయకపోవడమే దీనికి కారణం. పారిశుధ్య సిబ్బంది స్పందించి సకాలంలో పూడికలు తొలగించాలి.

– కె. ఈశ్వరమ్మ, రజకవీధి, ఇసుకతోట

ఏయూ స్థలాలకు రక్షణేది?



పోలమాంబ గుడికి సమీపంలో తొలగించిన గోడ

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన విలువైన స్థలాలపై కూటమి నేతల కన్ను పడిందా..? సభలు, సమావేశాలు, ఖాళీ స్థలాల అద్దె పేరిట ఏయూ స్థలాల్లోకి చొచ్చుకొస్తూ.. వీటిలో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారా..? ఇటీవల కాలంలో జరుగుతున్న పరిణామాలతో వర్సిటీ వర్గాల్లో ఇదే ప్రచారం జోరుగా సాగుతోంది.

గోడలు కూల్చడం వెనుక ఎవరు?

వందల కోట్లు విలువ చేసే ఏయూ స్థలాలను పరిరక్షించేందుకు గతంలో పటిష్టమైన రక్షణ గోడలు నిర్మించారు. ఇప్పుడు వాటిని ఎడా పెడా కూల్చేస్తుండడం గమనార్హం. పెదవాల్తేరు దారిలో పోలమాంబ గుడికి సమీపంలో, అదే విధంగా ఫారిన్ స్టూడెంట్స్ వసతి గృహాలు వైపు కాంపౌండ్ వాల్స్‌ను కూల్చేశారు. వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన ప్రధాన నరేంద్రమోదీ సభకు ఏర్పాట్లలో భాగంగా పలు చోట్ల ప్రహరీ కూల్చేశారు. అయితే వీటిని నేటికీ పునర్నిర్మాణం చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఏయూ హాస్టల్ వైపు ఉన్న ఖాళీ స్థలాలను కబ్జా చేసే క్రమంలోనే కూటమి నేతలు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారని వర్సిటీ వర్గాల్లో చర్చసాగుతోంది. హాస్టళ్ల వైపు గోడ కూల్చేయడంతో రాత్రి వేళలో బయట వ్యక్తులు ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. కొంతమంది గ్యాంగ్ అక్కడికి వచ్చి గంజాయి, మద్యం సేవిస్తున్నట్లు చెబుతున్నారు. ఖాళీ స్థలాల పరిరక్షణపై దృష్టి సారించాలని పలువురు ఆచార్యులు, ఉద్యోగులు కోరుతున్నారు.



ఫారిన్ స్టూడెంట్ హాస్టల్ వైపు తొలగించిన గోడ

కొనసాగుతున్న కానిస్టేబుల్ నియామక పరీక్షలు



లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుల్ నియామకాల కోసం అభ్యర్థులకు శారీరకదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపడుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు కైలాసగిరి పోలీస్ క్రీడా మైదానంలో గత నెల 31న ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన పరీక్షలకు 600 మందికి గాను 333 మంది అభ్యర్థులు హాజరైనట్టు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. వారికి పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. ఆయా పరీక్షల్లో 258 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులై తదుపరి పరీక్షలకు అర్హత సాధించినట్టు తెలిపారు. ఈ పరీక్షల పర్యవేక్షణలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ధీర వనిత కమలా హారిస్

మాజీ మేయర్ రాజాన రమణి



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణి, ఆచార్య యార్లగడ్డ తదితరులు

విశాఖ విద్య: మహిళల అభ్యున్నతికి ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ రచనలు తోడ్పాటుగా నిలుస్తున్నాయని మాజీ మేయర్ రాజాన రమణి అన్నారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ రచించిన 'సమరశీల ధీరవనిత కమలా హారిస్ ' గ్రంథాన్ని శుక్రవారం ఏయూ హిందీ విభాగం సెమినార్ హాల్లో ఆమె ఆవిష్కరించి తొలి గ్రంథాన్ని ప్రముఖ వ్యాపారవేత్త పాత్రు బ్రహ్మానందంకు అందజేశారు. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ రాజకీయంగా ఉన్నత శిఖరాలకు ఎదిగిన ప్రవాస భారతీయురాలి కోసం పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య రజిని మాట్లాడుతూ 11 చాప్టర్లతో అమెరికా రాజకీయాలు, వ్యక్తుల గురించి యార్లగడ్డ చక్కగా రచించారని కొనియాడారు. నల్లజాతి మహిళ అయిన కమల ఆ స్థాయికి రావడం గర్వించదగ్గ విషయం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన పుస్తక రచయిత యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ అధిక శాతం మంది భారతీయులు అమెరికాలో ఉన్నారని, అయితే సెలవులకైనా మాతృదేశానికి వారు రావడానికి ఇష్టపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథ స్వీకర్త పాత్రు బ్రహ్మానందం మాట్లాడుతూ తన పేరును స్వీకర్తగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య బాల మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు జ్యోతిబసు



జ్యోతిబసు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: కమ్యూనిస్టు యోధుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు 15వ వర్ధంతిని శుక్రవారం ఆరిలోవ ప్రాంతం తోటగరువు దరి బీఎస్‌ఆర్ నగర్‌లో సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీని బలోపేతం చేయడంతో జ్యోతిబసు కృషి ఎనలేనిదని కొనియాడారు. మొట్టమొదటి రైల్వే యూనియన్ స్థాపించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. బెంగాల్‌లో కార్మిక వర్గాన్ని, రైతులను ఏకం చేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. ఆయన 22 ఏళ్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు అనేక పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సూర్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతోనే స్టీల్‌ప్లాంట్‌కు భవిత



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రాంబాబు,మాజీ కార్పొరేటర్ ఈశ్వరమ్మ

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పూర్తిగా మనుగడ సాధించాలంటే సెయిల్‌లో విలీనం చేయాలని గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు,మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 1,389 రోజు కొనసాగింది. ఈసందర్భంగా రాంబాబు, ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కొంత మేర ఆర్థిక సమస్యల నుంచి బయటపడడానికి తాత్కాలిక ఉపశమనంగా ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ శాశ్వతమైన పరిష్కారం కాదని వారు చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, సొంత గనులు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బలమైన సంస్థగా ఎదుగుతుందని చెప్పారు. దీనిపైన కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదన్నారు. ఆర్థిక ప్యాకేజీ ఏ రూపంలో ఇస్తున్నారో స్పష్టం చేయలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించాలని.. అవసరమైన వసతులు కల్పించి పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలో గొలగాని అప్పారావు, ఎ. నూకేశ్వరరావు, భానుమూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

బుట్టబొమ్మా...బుట్టబొమ్మా...



ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కళారూపాలు



ఆకట్టుకుంటున్న ప్రతిమలు



కళారూపాల వద్ద సందర్శకులు

ఏయూక్యాంపస్: బుట్టబొమ్మా...బుట్టబొమ్మా అంటూ సినిమా పాట గుర్తుకు తెస్తున్నాయి ఈ బొమ్మలు. బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ వెనుక మైదానంలో ఏర్పాటు చేసిన విశాఖ ఎక్స్‌పో సందర్శకులను కట్టిపడేస్తుంది. భారతీయ మహిళలు, సంప్రదాయ వస్త్రధారణ, ఎడ్లబళ్లు,గ్రామీణ ఇళ్లను తలపిస్తూ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ప్రవేశ ద్వారం సెట్ ఎంతగానో ఆకట్టుకుంటోంది. కళాకారులు ఎంతో నైపుణ్యంతో ఈ శిల్పాలను, సెట్‌ను నిర్మించారు. మహేష్ బాబు నటించిన శ్రీమంతుడు సినిమాలో దుబాయ్ వెళ్లి సెంటే తెచ్చా....జపాన్ వెళ్లి పౌడర్ తెచ్చా... అంటూ సాగే ఈ పాట సెట్‌ను పూర్తిగా ఇక్కడ యధాతథంగా నిర్మించడం విశేషం. దాదాపు 15 రోజులు కళాకారులు శ్రమించి ఈ సెట్‌ను తయారు చేసి ఇక్కడ ఏర్పాటు చేశారు.

మంచుకొండల్లో విహరించే అనుభూతి

ఎగ్జిబిషన్ లోపల ఏర్పాటు చేసిన కశ్మీర్ సిటీ ప్రత్యేక సెట్‌లు, మంచుకొండల్లో విహరిస్తున్నామనే భ్రమను కలిగించే విధంగా ఉన్నాయి.కొండలపై నుంచి నిరంతరం ప్రవహించే జలపాతం, పక్కనే ఆకుపచ్చని యాపిల్ చెట్లు, మంచుతో కప్పబడిన ఇళ్లు ఎంతో సహజత్వంతో ఆకట్టుకుంటున్నాయి. నగరవాసులు, పర్యాటకులు ఫొటోలు తీసుకుంటూ రీల్స్ చేస్తూ సందడి చేస్తున్నారు. ఈ భారీ సెట్ నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.





ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన కశ్మీర్ సిటీ నమూనా



కశ్మీర్ అందాలు..

ఘనంగా పోలమాంబ పరస



పూజలందుకున్న పోలమాంబ

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులో వెలసిన కరకచెట్టు పోలమాంబ అమ్మవారి పరసను శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెదవాల్తేరు గ్రామ పెద్దలు పోలమాంబ ఉత్సవ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం పెదవాల్తేరు రాముల వారి ఆలయం నుంచి విగ్రహాలను పోలమాంబ అమ్మవారి ఆలయానికి తరలించారు. భాజా భజంత్రీలు, తప్పెటగుళ్లతో ఊరేగింపు కొనసాగింది. రహదారిలో ఏర్పాటు చేసిన షాపుల వద్ద రద్దీ నెలకొంది.

రహదారి భద్రతపై అవగాహన



డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న వాహన తనిఖీ అధికారి మాధవి

మద్దిలపాలెం: జాతీయ రహరి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం మద్దిలపాలెం జంక్షన్ వద్ద అవగాహన ప్రదర్శన నిర్వహించారు. డీటీసీ ఆదినారాయణ సామాజిక కార్యకర్తలతో పాటు,ట్రాఫిక్ పోలీసులు,రవాణా తనిఖీ అధికారులు ఐ.వేణుగోపాల్,బుచిరాజు ,బాలాజీ తదితరులతో కలిసి ప్ల కార్డులు బ్యానర్ల ప్రదర్శించి రహదారి భద్రత నియమాలు పాటించాలని కోరారు. డీటీసీ ఆదినారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పాదచారులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి అని, సిగ్నల్స్‌ను పాటించాలని కోరారు. అప్పుడే ప్రమాదాలను కట్టడి చేయవచ్చునన్నారు.

డ్రైవర్లదే కీలక పాత్ర

మద్దిలపాలెం: డ్రైవర్ ఆరోగ్యంగా ఉన్నప్పుడే వాహనాన్ని సవ్యంగా నడపగలరని విశాఖపట్నం ప్రాంతీయ రవాణా కార్యాలయ వాహన తనిఖీ అధికారి మాధవి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశాఖ డిపోలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంలో డ్రైవర్లదే గురుతర బాధ్యత అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

20న సర్వీస్ ప్రొవైడ్ మేళా

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో ఈ నెల 20న ఉదయం 11 గంటలకు సర్వీస్ ప్రొవైడ్ మేళా నిర్వహిస్తున్నట్లు జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ అనంతరం హోమ్ ట్రయాంగిల్ సంస్థ వారి యాప్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్లను ఆన్ బోర్డ్ చేస్తారని పేర్కొన్నారు. మొదటి దశలో వడ్రంగులు, ప్లంబింగ్ సేవలు, విద్యుత్ సేవలు, ఉపకరణాలు (వీటిలో ఏసీ, రిఫ్రిజిరేటర్/వాషింగ్ మెషీన్-వాటర్ ప్యూరిఫైయర్, గీజర్) ఉంటాయని తెలిపారు.

త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు ప్రారంభం



అప్పన్నను సంగీత కళాభారతి ' బిరుదుతో సత్కరిస్తున్న ఆరాధన ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం: త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు మద్దిలపాలెం కళాభారతిలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమాన్ని తమిళనాడు మ్యూజిక్ అండ్ డ్యాన్స్ యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి డాక్టర్ వీణ గాయత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. త్యాగరాజ ఉత్సవాలు అత్యంత వైభవంగా ఏడు రోజుల పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. కళాకారులు యూఎస్‌ఏ, కెనడా వంటి దూర ప్రదేశాల నుంచి వచ్చి పాల్గొనడం గొప్ప విషయమన్నారు. ఆరాధన ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు మాట్లాడుతూ సంగీతాన్ని ప్రోత్సహించడం, మన కళలను కాపాడడం కోసమే కళాభారతి త్యాగరాజ ఆరాధన ట్రస్టు కంకణం కట్టుకుందన్నారు. ఉత్సవాల్లో 1100 మంది కళాకారులు ఏడు రోజుల పాటు పాల్గొనున్నారన్నారు. కార్యదర్శి శ్రీరామదాసు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ఒక సంస్థ 29 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

బిరుదు ప్రదానం

త్యాగరాజ ఆరాధన ట్రస్టు ప్రతిష్టాత్మకంగా ఏటా ఇచ్చే బిరుదు 'సంగీత కళాభారతి 2025 గాను ప్రముఖ నాదస్వర విద్వాంసులు గురువిల్లి అప్పన్నకు ప్రదానం చేశారు.